సాక్షి
నిజామాబాద్
బుధవారం : 24 : జనవరి : 2024



ప్రత్యేకాధికారులకే పాలన!
సర్పంచుల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించేందుకు కసరత్తు చేస్తోంది.
- 10లో ▸



విద్యార్థుల రాస్తారోకో
బోధన్ నుంచి సాలూరకు బస్సు నడపాలని బోధన్‌లోని అంతర్రాష్ట్ర రోడ్డుపై విద్యార్థులు రాస్తారోకో చేపట్టారు.
- 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
31.6 /21.6

వాతావరణం
ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

పీసీసీ పీఠం రేసులో..



ఎమ్మెల్సీ పదవి దక్కించుకున్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పీఠం కూ లైన్ క్లియరైంది. ఉమ్మడి జిల్లాలో కీలక నేతలైన మాజీ మంత్రి షబ్బీర్ అలీకి ప్రభుత్వ సలహాదారు పదవి రాగా, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్ రెడ్డికి కేబినెట్‌లో బెర్త్ ఖాయమైనట్లు రాజకీయవర్గాల్లో చర్చసాగుతోంది.

- మహేశ్‌కుమార్ గౌడ్‌కు లైన్ క్లియర్
- షబ్బీర్‌ను వరించిన 'ప్రభుత్వ సలహాదారు'
- సుదర్శన్‌రెడ్డికి కేబినెట్ బెర్త్ ఖాయం!
- ఉమ్మడి జిల్లాలో వివిధ వర్గాల్లో ఆసక్తి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి కీలక పదవుల విషయమై కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పాటు వివిధ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు అయ్యాక మొదటివిడతలో మంత్రివర్గంలో ఎవరికీ స్థానం దక్కలేదు. దీంతో జిల్లా నుంచి కేబినెట్ బెర్త్ దక్కే విషయమై రకరకాల విశ్లేషణలు జరుగుతూ వచ్చాయి. మైనారిటీ కోటాలో షబ్బీర్ అలీకి ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇస్తారంటూ.. మరోవైపు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌కు సైతం ఎమ్మెల్సీతో పాటు కేబినెట్ బెర్త్ కేటాయించనున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. ఇదిలా ఉండగా వీరిద్దరిలో ఒకరికి పీసీసీ అధ్యక్ష పదవి, మరొకరికి కేబినెట్ బెర్త్ దక్కనుందనే వార్తలు సైతం వచ్చాయి. మరోవైపు బోధన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి రెండో విడతలో కేబినెట్ బెర్త్ దక్కనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, మహేశ్‌కుమార్ గౌడ్‌లు ముగ్గురూ సీనియర్ నేతలు కావడంతో పాటు ఉమ్మడి జిల్లా నుంచి కచ్చితంగా కీలకమైన పదవులు ఇవ్వాల్సిన ఆవశ్యకత నేపథ్యంలో ప్రతిఒక్కరిలో వీరికి దక్కనున్న పదవుల విషయమై అంచనాలు పెరుగుతున్నాయి.

- బోధన్ నుంచి నాలుగోసారి ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ మంత్రి, పీసీసీ కోశాధికారి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి మంత్రివర్గంలో బెర్త్ ఖాయమని తెలుస్తోంది. షబ్బీర్ అలీకి ప్రభుత్వ సలహాదారు పదవి కేటాయించడంతో పాటు, మహేశ్‌గౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పదవి కేటాయించనున్నట్లు తెలుస్తుండడంతో సుదర్శన్‌రెడ్డికి కేబినెట్ ఖాయమైనట్లేనని పార్టీ నాయకులు, కార్యకర్తలు చెబుతున్నారు.

షబ్బీర్‌కు సలహాదారు పదవితో..

షబ్బీర్‌అలీకి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా పదవి దక్కడంతో ఉమ్మడి జిల్లాకు దక్కాల్సిన కీలక పదవుల విషయమై మెల్లగా స్పష్టత వస్తోంది. తాజాగా మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ దక్కడంతో జిల్లా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిది దక్షిణ తెలంగాణ కాగా.. ఉత్తర తెలంగాణ నుంచి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు బీసీ కోటాలో పీసీసీ అధ్యక్ష పీఠం అప్పగించేందుకు పార్టీ హైకమాండ్ ఆలోచన చేస్తున్నట్లు గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్‌గౌడ్ నిజామాబాద్ అర్బన్ టికెట్టు ఆశించారు. అయితే ఈ స్థానంలో షబ్బీర్‌ను నిలబెట్టిన నేపథ్యంలో జాతీయ నాయకత్వం సూచన మేరకు టికెట్టును త్యాగం చేశారు. దీంతో మహేశ్‌గౌడ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇస్తామని అగ్రనేతలు హామీ ఇచ్చారు. మారిన సమీకరణాల నేపథ్యంలో మహేశ్ గౌడ్‌కు మంత్రి పదవికి బదులు పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వనున్నట్లు సమాచారం. నలబై సంవత్సరాలుగా పార్టీకి సేవలందిస్తున్న మహేశ్‌గౌడ్ ఎన్ఎస్‌యూఐ నుంచి రాజకీయ జీవితం ప్రారంభించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా, అఖిల భారత యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా, పీసీసీ కార్యదర్శిగా, పీసీసీ అధికార ప్రతినిధిగా, ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. ప్రస్తుతం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఆర్గనైజింగ్ వ్యవహారాలను వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో మహేశ్‌కుమార్ గౌడ్ అత్యంత సమర్థంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో పీసీసీ పీఠం దక్కడం ఖాయమని పార్టీ శ్రేణులు అంటున్నాయి.

రసవత్తరంగా 'ఆర్మూర్' రాజకీయం!



ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయానికి తరలి వచ్చిన కౌన్సిలర్లు

- బల్దియా చైర్‌పర్సన్ అవిశ్వాసంపై ఈసీ నుంచి స్పష్టత
- నోటిఫికేషన్ రావడమే తరువాయి!
- ఎన్నికను అడ్డుకోవడానికి వినీత వర్గం ప్రయత్నాలు
- ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వాలని వైస్ చైర్మన్ అనుచరుల డిమాండ్
- ఎమ్మెల్యేకు ఓటు హక్కుపై కరువైన స్పష్టత

ఆర్మూర్: ఆర్మూర్ బల్దియాలో రాజకీయం రసవత్తరంగా మారింది. మున్సిపల్ పీఠం కోసం ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు అధికారులు నిర్ధారించడంతో తదుపరి కార్యాచరణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ పరిధిలోకి చేరింది. ఇక చైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడాల్సి ఉంది. ఈ లోగా ఆర్మూర్ మున్సిపాలిటీలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పండిత్ వినీత వర్గీయులు, కుటుంబ సభ్యులు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడి సహకారంతో మంత్రిని కలిసి అవిశ్వాస తీర్మానం సమావేశంలో లొసుగులను ఎత్తి చూపుతూ ఎన్నికను అడ్డుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు చైర్‌పర్సన్ పదవి ఖాళీ అయిన నేపథ్యంలో వైస్ చైర్మన్ షేక్ మున్నుకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వాలంటూ మైనారిటీ వర్గాలు అధికారులపై ఒత్తిడి పెంచుతున్నాయి. లేని పక్షంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరిస్తున్నారు.

కోరంపై ఆర్డీవోను కలిసిన కౌన్సిలర్లు

చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం సమావేశంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఓటు హక్కుపై ఆర్డీవో స్థాయి అధికారికి, మున్సిపల్ కమిషనర్‌కు సైతం స్పష్టత లేకపోవడం వివాదాస్పదం అవుతోంది. మున్సిపాలిటీలో ఎక్స్ అఫిషియో మెంబర్‌గా తనకు ఓటు హక్కు కల్పించాలని 2023 డిసెంబర్ 29న రాకేశ్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. జనవరి 4న అవిశ్వాస తీర్మానం సమావేశం నిర్వహించారు. అప్పటికీ ఎమ్మెల్యేకు ఓటు హక్కు రాలేదని సమాచారం. దీంతో ఆయన సమావేశానికి హాజరైనప్పటికీ ఓటు వేయకుండా వేదికపై కూర్చున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మొత్తం 36 మంది కౌన్సిలర్లలో 24 మంది కౌన్సిలర్లను కోరంగా లెక్క గడతారు. కానీ సమావేశం నిర్వహించిన ఆర్డీవో వినోద్‌కుమార్ కలెక్టర్‌కు పంపిన నివేదికలో ఎమ్మెల్యే ఓటును కలుపుకొని 37 మంది ఓట్లలో 25 మంది కోరం సభ్యులుగా పేర్కొన్నారు. ఈ విషయమై ఇరువర్గాల కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై స్పష్టతనివ్వాలంటూ వారు మంగళవారం ఆర్మూర్ ఆర్డీవోను కలిశారు. కోరం సభ్యులను నిర్ధారించడంలో అధికారులు నిబంధనలు పాటించలేదంటూ నిలదీశారు. దీంతో ఆయన కలెక్టర్‌ను కలిసి వివరిస్తానని జిల్లా కేంద్రానికి వెళ్లారు. కౌన్సిలర్లకు బుధవారం కలెక్టర్ అపాయింట్మెంట్ లభించింది. మున్సిపల్ ఓట్ల విషయంలో అధికారులకు స్పష్టత లేకపోవడంతో చైర్‌పర్సన్ వినీతపై అవిశ్వాస తీర్మానం వివాదాస్పదంగా మారుతోంది.

న్యూస్‌రీల్

ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవాలి



బాల్కొండ: గోదావరి నదిలోని ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలని గోదావరి రివర్ మేనేజ్‌మెంట్(జీఆర్ఎంబీ) సభ్యులు రాజీవ్‌కుమార్, ప్రసాద్, రమణమూర్తి అన్నారు. మంగళవారం శ్రీరాంసాగర్ ప్రాజెక్టును, సరస్వతి, లక్ష్మి, వరద కాలువలను ఎస్సారెస్పీ అధికారులతో కలిసి వారు పరిశీలించారు. గోదావరి నుంచి నీటి లభ్యత, ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి ప్రస్తుత సంవత్సరం వచ్చిన వరద నీటి వివరాలను తెలుసుకున్నారు. నీటి వివాదాలు తలెత్తకుండ ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేయాలన్నారు. సరస్వతి కాలువ, లక్ష్మి కాలువల ద్వారా సరైన నీటి విడుదల ఉందా లేదా అనే విషయాలను ఆరా తీశారు. అనంతరం ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం పంపుహౌజ్‌ను సందర్శించారు. ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ చక్రపాణి, డిప్యూటీ ఈఈ గణేష్ తదితరులు ఉన్నారు.

అగ్రి డైరీ ఆవిష్కరణ



డొంకేశ్వర్(ఆర్మూర్): తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ డైరీని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం ఆవిష్కరించారు. వ్యవసాయ అధికారులకు ఉపయోగపడే విధంగా ఈ డైరీ ఉందని, పంటల సాగులో రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు చేయాలని కలెక్టర్ అన్నారు. అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, టాడా చైర్మన్ రవీందర్, వ్యవసాయ అధికారులు గోపి, హీరా జాదవ్, సౌమ్య, దేవిక, తదితరులు పాల్గొన్నారు.

టీసీసీ సర్టిఫికెట్లు తీసుకెళ్లాలి

నిజామాబాద్ అర్బన్: టీసీసీ(టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్) ఉత్తీర్ణులైన వారు తమ సర్టిఫికెట్లను తీసుకు వెళ్లాలని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని విద్యా శాఖ కార్యాలయం(రూం నం. 103)లో హాల్ టికెట్, ఆధార్‌కార్డు సమర్పించి సర్టిఫికెట్ తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

వచ్చే నెల 1న జేఎల్ఎం అభ్యర్థులకు స్తంభం పరీక్షలు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు సంబంధించి జూనియర్ లైన్‌మెన్ పోస్టుల కోసం అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్, స్తంభం పరీక్షలు ఫిబ్రవరి 1న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యుత్ శాఖాధికారి రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. నియామక కమిటీ ద్వారా స్తంభం పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అర్హుల జాబితాను అభ్యర్థుల చిరునామకు పోస్టు ద్వారా పంపుతామని పేర్కొన్నారు. నాలుగో జాబితాను కార్యాలయ నోటీసు బోర్డులో ఉంచిన్నట్లు తెలిపారు. నియమక ప్రక్రియ పూర్తిగా పారదర్శంగా జరుగుతుందన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలను వాయిదా వేస్తూ రాష్ట్ర విద్యా శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 29న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించాలని గతంలో నిర్ణయించారు. తాజాగా ఎన్నికలను వేస్తున్నట్లు ప్రకటించి, మళ్లీ ఆదేశాలు వచ్చే వరకు వేచి చూడాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'పీఆర్‌సీ' సమీక్షలో మున్సిపల్ కమిషనర్

నిజామాబాద్‌నాగారం: మున్సిపల్ ఉద్యోగులకు సంబంధించి జీతభత్యాలు, ఇతర సమస్యలపై పీఆర్‌సీ కమిటీ సమీక్షకు నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరందు మంగళవారం హాజరయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సమీక్షలో మున్సిపల్ ఉద్యోగులకు సంబంధించి పే రివిజన్, ఇతర సమస్యలపై నివేదిక సమర్పించారు. అలాగే ఈ సీడీఎంతో పాటు, సెక్రెటరీ రామకృష్ణారావుకు మున్సిపల్ ఉద్యోగుల సమస్యల నివేదికను అందజేశారు.

రైస్ మిల్లు సీజ్



అధికారులు సీజ్ చేసిన రైస్‌మిల్లు

నవీపేట: నవీపేట మండలం అభంగపట్నం గ్రామంలోని యూనిస్ ట్రేడర్స్ రైస్‌మిల్లుపై సివిల్ సప్లయ్ అధికారులతో పాటు పోలీసులు మంగళవారం దాడి చేశారు. గత సీజన్‌లో ఎఫ్‌సీఐ 26 వేల టన్నుల ధాన్యాన్ని రైస్‌మిల్లుకు అప్పగించింది. రూ. 6 కోట్ల విలువ చేసే బియ్యాన్ని తిరిగి అప్పగించాల్సి ఉండగా ఇప్పటికీ ఇవ్వలేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సీఎంఆర్ రికవరీపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. అదేవిధంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి రైస్‌మిల్లర్ల అవినీతిపై సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తహసీల్దార్ ధన్వాల్, నిజామాబాద్ నార్త్ టౌన్ సీఐ సతీష్, సివిల్ సప్లయ్ డీఎం జగదీష్ ఆధ్వర్యంలో రైస్‌మిల్లుపై దాడి చేశారు. రికార్డులను స్వాధీనం చేసుకుని మిల్లును సీజ్ చేశారు. సివిల్ సప్లయ్ డీఎం జగదీష్ ఫిర్యాదు మేరకు రైస్‌మిల్లు యజమాని మహమ్మద్ యూనిస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.

పీజీ పరీక్షలు ప్రారంభం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమైనట్లు కంట్రోలర్ ఎం అరుణ, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. క్యాంపస్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ పరీక్షా కేంద్రాన్ని రిజిస్ట్రార్ ఎం యాదగిరి తనిఖీ చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. రిజిస్ట్రార్ వెంట ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, అడిషనల్ కంట్రోలర్ సాయిలు ఉన్నారు. కాగా ఉదయం జరిగిన 3వ సెమిస్టర్ పరీక్షకు 1,708 మంది విద్యార్థులకు 1,618 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 181 మంది విద్యార్థులకు 181 మంది హాజరయ్యారని కంట్రోలర్ తెలిపారు.

క్రమబద్ధీకరణలో నకిలీలలు

- ఫేక్ సర్టిఫికెట్లు సమర్పించిన కొందరు అధ్యాపకులు
- జిల్లాలో ఒకరిపై కేసు నమోదు
- కొనసాగుతున్న విచారణ



నిజామాబాద్ అర్బన్: కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ ప్రక్రియలో అక్రమాలు జరిగినట్లు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ తేల్చింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేసింది. ఇందులో భాగంగా జిల్లాలోని 150 మంది వరకు రెగ్యులర్ అయ్యారు. అయితే రెగ్యులరైజ్ కావడం కోసం కొందరు అధ్యాపకులు నకిలీ ధ్రువపత్రాలు సమర్పించారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ విద్యాశాఖ విచారణ చేపట్టింది. జిల్లాలో కూడా కొందరు అధ్యాపకులపై విచారణ సాగుతోంది.

నిషేధిత యూనివర్సిటీల నుంచి పట్టాలు

క్రమబద్ధీకరణ సమయంలో అర్హతలు చూపుతూ అన్ని ధ్రువపత్రాలు సమర్పించాలని అధికారులు ఆదేశించారు. దీంతో కొందరు పీజీ, ఇతర అర్హతలు లేకున్నా ఉన్నట్లు నకిలీ సర్టిఫికెట్లు సమర్పించారు. ఇతర రాష్ట్రాల్లోని నిషేధిత యూనివర్సిటీల నుంచి దూర విద్య(డిస్టెన్స్)లో చదివినట్లు సర్టిఫికెట్లు అందజేశారు. ఆయా యూనివర్సిటీల నుంచి సర్టిఫికెట్లను కొనుగోలు చేసి క్రమబద్ధీకరణ పొందారని ఫిర్యాదులు అందాయి. జిల్లాలో 150 మంది రెగ్యులర్ కాగా సుమారు 22 మంది ఇతర రాష్ట్రాలకు సంబంధించిన డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు సమర్పించినట్లు తెలిసింది. వీరిపై ఇంటర్ విద్యాశాఖ అధికారులు విచారణ చేపడుతున్నారు. ఇందులో భాగంగా నగరంలోని మహిళా జూనియర్ కళాశాలలో ఓ కాంట్రాక్టు అధ్యాపకురాలు నకిలీ పీజీ సర్టిఫికెట్ సమర్పించినట్లు తేలింది. దీంతో ఆమెను ఉద్యోగం నుంచి తొలగించి, కేసు నమోదు చేయించారు. అలాగే మిగతా వారిపై కూడా సమగ్ర విచారణ చేస్తున్నారు. జేఎస్‌టీయూ అధికారులతో కలిసి ఉన్నత విద్యాశాఖ అధికారులు ఈ విచారణలో పాల్గొంటున్నారు. ఉద్యోగం రెగ్యులరైజ్ అవుతుందని కొందరు అప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా డిస్టెన్స్ సర్టిఫికెట్లు కొనుగోలు చేసి సమర్పించినట్లు తెలిసింది

స్థానిక అధికారుల పాత్రపై ఆరా

కాంట్రాక్ట్ అధ్యాపకులు సమర్పించిన ధ్రువపత్రాలను పూర్తిగా పరిశీలించకుండానే జిల్లా ఇంటర్ అధికారులు రెగ్యులరైజేషన్ కోసం సిఫార్సు చేసినట్లు తెలిసింది. యూనియన్ నాయకులు జోక్యం చేసుకోవడంతో స్థానిక అధికారులు కొందరు చూసి చూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో అధికారుల పాత్రపై కూడా రాష్ట్ర అధికారులు ఆరా తీస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ రహస్య విచారణ కొనసాగుతోంది. ఇందులో జిల్లాలో నకిలీ సర్టిఫికెట్లతో క్రమబద్ధీకరణ పొందిన వారిని త్వరలోనే గుర్తించి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

అధికారులు పరిశీలిస్తున్నారు

కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణకు సంబంధించి రాష్ట్ర అధికారులే విచారణ చేస్తున్నారు. ఒక అధ్యాపకురాలు నకిలీ ధ్రువపత్రాలు సమర్పించినట్లు తేలడంతో చర్యలు తీసుకున్నాం. ఉద్యోగం నుంచి తొలగించి కేసు నమోదు చేశాం. ప్రస్తుతం రాష్ట్ర అధికారుల పరిధిలో విచారణ కొనసాగుతోంది.
– రఘురాజ్, జిల్లా ఇంటర్ విద్యాధికారి

సులేమాన్ నగర్‌లో ఉద్రిక్తత

- 'అయోధ్య' సంబరాల్లో భాగంగా పటాకులు పేల్చడంతో..
- ఇరువర్గాల మధ్య వివాదం
- దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని ఐదు గంటల పాటు రాస్తారోకో



ఆందోళనకారులను సముదాయిస్తున్న సీఐ



సులేమాన్‌నగర్‌లో రాస్తారోకో చేస్తున్న బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు

రుద్రూర్: రుద్రూర్ మండలంలోని సులేమాన్ నగర్‌లో భజరంగ్ దళ్, వీహెచ్‌పీ కార్యకర్తలు మంగళవారం ఐదు గంటల పాటు ప్రధాన రహదారి (రుద్రూర్– కోటగిరి)పై బైఠాయించడంతో ఉద్రిక్తత నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ పురస్కరించుకుని సులేమాన్‌నగర్‌లో సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాల్చిన టపాసులు పేలిపోయి ఒక వర్గానికి చెందిన ప్రార్థన మందిరం వద్ద పడ్డాయి. ఈ ఘటనతో ఘర్షణ వాతావరణం చోటు చేసుకోవడంతో గ్రామ పెద్దలు శాంతింప చేశారు. కాగా నిర్లక్ష్యంగా టపాసులు కాల్చిన వ్యక్తిని మంగళవారం ఉదయం జీపీ వద్దకు పిలిపించి గ్రామ పెద్దలు మందలించి వదిలేశారు. ఇదే సమయంలో ఒక వర్గానికి చెందిన వ్యక్తులు మరో వర్గానికి చెందిన కొందరిపై దాడికి పాల్పడ్డారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రధాన రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న సమీప గ్రామాల్లోని బజరంగ్ దళ్, బీజేపీ కార్యకర్తలు బాధితులకు మద్దతుగా రాస్తారోకో చేపట్టారు. బాధితులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. స్థానిక పోలీసులు నచ్చజెప్పినప్పటికీ విన్పించుకోలేదు. దీంతో ఘటనా స్థలానికి వచ్చిన బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్ పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండడంతో అదనపు పోలీసు బలగాలను సులేమాన్ నగర్‌కు రప్పించారు. సీఐలు జయేష్ రెడ్డి, శ్రీనివాస్‌రాజ్ , సమీప పోలీస్‌స్టేషన్‌ల ఎస్సైలు సందీప్ , మహేందర్, కృష్ణ కుమార్ పరిస్థితి చేజారకుండా ఆందోళన చేస్తున్న వారిని సముదాయించే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. ఉదయం పది గంటలకు ప్రారంభమైన ఆందోళన సుమారు ఐదు గంటల పాటు కొనసాగింది. నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ.. రోడ్డుపైన టెంట్ వేసి ఆందోళన చేశారు. అక్కడే అల్పాహారం తీసుకున్నారు. దీంతో కోటగిరి, పోతంగల్ మండలాల నుంచి వస్తున్న వాహనాలను ట్రాఫిక్ డైవర్ట్ చేశారు. ఈ వాహనాలను రాయకూర్, చిక్కడపల్లి గ్రామాల మీదుగా పంపించారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తామని ఏసీపీ ఇచ్చిన స్పష్టమైన హామీతో రాస్తారోకో విరమించారు.

'లెండి' పరిష్కారానికి కృషి

- రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఆగిన పనులు పునరుద్ధరిస్తాం
- అంతర్రాష్ట్ర ప్రాజెక్టును సందర్శించిన ప్రొఫెసర్ కోదండరాం



లెండిని పరిశీలిస్తున్న కోదండరాం తదితరులు

మద్నూర్(జుక్కల్): మహారాష్ట్రలో నిలిచిపోయిన అంతర్రాష్ట్ర లెండి ప్రాజెక్ట్ పనులపై ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని టీజేఎస్ పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మద్నూర్ మండలానికి సరిహద్దున మహారాష్ట్రలోని దెగ్లూర్ తాలుకాలో ఉన్న ప్రాజెక్టును మంగళవారం కోదండరాం పార్టీ నాయకుతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. 1984లో అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్‌బీ చౌహాన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు హయాంలో ఇరు ప్రభుత్వాలు ఒప్పందాలు చేసుకుని లెండి ప్రాజెక్ట్ పనులను ప్రారంభించాయన్నారు. మహారాష్ట్రలో భూనిర్వాసితులు పునరావాసం కోసం ఆందోళనలు చేయడంతో పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. 2003లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి నూతన అంచనా వ్యయాలపై ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. ప్రాజెక్ట్‌లో 62 శాతం మహారాష్ట్రకు, 38 శాతం మన రాష్ట్రానికి ఖర్చులు, నీళ్లు పంచుకోవాలని నిర్ణయించినట్లు వివరించారు. మొత్తం 14 గేట్లు ఉన్న ప్రాజెక్టుకు ఎనిమిదేళ్ల క్రితం 10 గేట్ల నిర్మాణ పనులు పూర్తి చేశారని, 4 గేట్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఒప్పందం ప్రకారం ప్రాజెక్ట్ సామర్థ్యం 6.36 టీఎంసీలు కాగా, తెలంగాణ వాటా కింద 3.63 టీఎంసీలు కేటాయిస్తారన్నారు. దీంతో మద్నూర్, బిచ్కుంద మండలాల్లోని 23 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. రెండు రాష్ట్రాల నిర్లక్ష్యంతోనే ప్రాజెక్ట్ పనులు నిలిచిపోయాయన్నారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ ప్రభుత్వం లెండి ప్రాజెక్ట్ గురించి కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి తాము మిత్రపక్షంగా ఉన్నందున ఇరిగేషన్ మంత్రితో మాట్లాడి లెండి ప్రాజెక్ట్, కాలువల పనులు పూర్తి చేసే విధంగా కృషి చేస్తామని కోదండరాం అన్నారు. టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నిజ్జన రమేశ్, డాక్టర్ శంకర్, లక్ష్మణ్ యాదవ్, సాబ్లె చందు, సంగారెడ్డి తుల్జారెడ్డి, రమేశ్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

బడా రాంమందిర్ భూముల పరిశీలన



న్యాల్‌కల్‌లో భూములను పరిశీలిస్తున్న అధికారులు

మోపాల్: మండలంలోని న్యాల్‌కల్, కంజర్ గ్రామాల్లో బడా రాంమందిర్ మఠం భూములను దేవాదాయశాఖ అధికారులు ప్రశాంత్‌కుమార్, గంగాధర్ మంగళవారం పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు సేకరించారు. వారి నుంచి ధ్రువపత్రాలు, కౌలు రశీదులు, పలు పత్రాలను సేకరించారు. సేకరించిన భూముల వివరాలను దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు తెలిపారు.

భక్తులు లేక వెలవెలబోయిన బడాపహాడ్



వర్ని: బడాపహాడ్ ఉర్సుకు భక్తులు లేక వెలవెలబోయింది. ఉత్సవాల్లో రెండో రోజైన మంగళవారం కవ్వాలి, సాంస్కృత కార్యక్రమాలు చేపట్టారు. కాగా ఉత్సవాలకు ప్రతి ఏటా అధిక సంఖ్యలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణలోని పలు జిల్లాల నుంచి భక్తులు వేల సంఖ్యలో వస్తుంటారు. కానీ ఈ యేడు భక్తులు లేకపోవడంతో బడాపహాడ్ ఖాళీగా కనబడుతోంది.

అంతర్జాతీయ పోటీలకు వినోద్‌నాయక్



నిజామాబాద్‌నాగారం: థాయిలాండ్‌లో ఈ నెల 26, 27వ తేదీల్లో నిర్వహించే అంతర్జాతీయ తైక్వాండో పోటీలకు సిరికొండ వాసి మాస్టర్ వినోద్‌నాయక్ ఎంపికయ్యారు. గతేడాది అక్టోబర్‌లో ఢిల్లీలో నిర్వహించిన సెలక్షన్ ట్రైల్స్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో ఎంపికయ్యారు. దేశం తరఫున పోటీ నుంచి 4వ సారి ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు సంతోషంగా ఉందని వినోద్ నాయక్ అన్నారు. 2022లో దుబాయిలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో చిన్న చిన్న పొరపాట్ల వల్ల పతకం కోల్పోయాను. ఈ సారి ఎలాగైనా పతకం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

నిర్దేశించిన సమయంలో దుకాణాలు మూసివేయాలి

ఖలీల్‌వాడి: జిల్లాలోని అన్ని రకాల వ్యాపారదారులు నిర్దేశించిన సమయంలో దుకాణాలు మూసివేయాలని కమిషనర్ ఆఫ్ పోలీస్ కల్మేశ్వర్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆస్పత్రులు, మెడికల్స్, సినిమా హాల్స్ తప్ప మిగితా అన్ని రకాల వ్యాపారదారులు ప్రతీరోజు రాత్రి కేటాయించిన సమయంలోగా మూసివేయాలన్నారు. నిబంధనలు పాటించని వ్యాపారదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కేజీబీవీ నిర్వహణపై ఫిర్యాదు



కలెక్టరుకు ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ

లింగంపేట: మండల కేంద్రంలోని కేజీబీవీ నిర్వహణ సక్రమంగా లేదని ఎంపీపీ గరీబున్సీసాబేగం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. కేజీబీవీని పరిశీలించిన ఎంపీపీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో నిర్వాహకులు కోడి గుడ్డు అందించడం లేదన్నారు. విద్యార్థుల చదువుపై ఆరా ఉపాధ్యాయులను ఆరా తీయగా లోపాలు కనిపించడంతో కలెక్టర్, డీఈవోకు ఫిర్యాదు చేసినట్లు ఎంపీపీ తెలిపారు.

ప్రత్యేకాధికారులకే ఇన్‌చార్జి పాలన!

- ఫిబ్రవరి 1తో ముగియనున్న సర్పంచుల పదవీ కాలం
- అధికారుల జాబితాను సిద్ధం చేస్తున్న జిల్లా యంత్రాంగం



మోర్తాడ్: సర్పంచుల పదవీ కాలం ఫిబ్రవరి 1తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి బాధ్యతలను తమకే అప్పగించాలన్న సర్పంచుల కోరికను కాదని ప్రభుత్వం ప్రత్యేకాధికారులకే పాలన బాధ్యతలు అప్పగించేందుకు మొగ్గు చూపింది. దీంతో ప్రత్యేకాధికారులుగా వ్యవహరించే వివిధ హోదాలో ఉన్న అధికారుల జాబితాలను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆయా జిల్లాల అధికార యంత్రాంగానికి ఆదేశించింది. గెజిటెడ్ అధికారులు, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ క్యాడర్ ఉద్యోగుల జాబితాలను జిల్లా అధికార యంత్రాంగం సిద్ధం చేస్తోంది. జిల్లాలో 530 జీపీలు ఉండగా అన్ని జీపీల పాలనా బాధ్యతలను ప్రత్యేకాధికారులకు అప్పగించనున్నారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడగానే ప్రత్యేకాధికారులకు పాలన వ్యవహారాలు చేపట్టనున్నారు. 2018లో పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించగా స్థానిక సంస్థలకు పదవి కాలం ముగియక ముందే ఎన్నికలు నిర్వహించాలని అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల తరహాలోనే పంచాయతీలకు, ఇతర స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలనే నిబంధన ఉంది. దీంతో పంచాయతీల పాలనను గాడిలో పెట్టేందుకు ప్రత్యేకాధికారులను నియమించే అంశం ఉండటంతో ప్రభుత్వం ప్రత్యేక పాలనకే మొగ్గుచూపింది. ప్రస్తుతం ఉన్న సర్పంచులకే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాల్సి ఉన్నా మెజార్టీ ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్‌కు చెందినవారు ఉండటంతో ప్రత్యేకాధికారుల ఎంపికనే మేలు అని ప్రభుత్వం భావించినట్లు తెలుస్తోంది. మరో వారంలో సర్పంచుల పదవీ కాలం ముగియనుండగా అంతలోనే ప్రత్యేకాధికారులుగా వ్యవహరించే వారి జాబితాను సిద్ధం చేసి ఉంచుతోంది. అధికారిక ఉత్తర్వులు వెలువడగానే పాలన బాధ్యతలను ప్రత్యేకాధికారులకు అప్పగించే అవకాశం ఉంది.

జాబితాలను సిద్ధం చేస్తున్నాం

గ్రామ పంచాయతీల బాధ్యతలను నిర్వర్తించే అధికారుల జాబితాలను సిద్ధం చేస్తున్నాం. మేజర్ పంచాయతీల బాధ్యత గెజిటెడ్ ఉద్యోగులకు, చిన్న పంచాయతీల బాధ్యత ఇతర క్యాడర్ ఉద్యోగులకు అప్పగించే అవకాశం ఉంది. జిల్లాలో 530 మంది ప్రత్యేకాధికారులను ఎంపిక చేస్తున్నాం.

– జయసుధ, జిల్లా పంచాయతీ అధికారిణి

బోదేపల్లి లిఫ్టు ద్వారా నీటి విడుదల



బోదేపల్లి లిఫ్టు నుంచి ప్రవహిస్తున్న నీరు

బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి నీటి సరఫరా చేసే లక్ష్మి కాలువ నీటి ఆధారంగా నిర్మించిన బోదేపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా అధికారులు నీటిని మంగళవారం ప్రారంభించారు. లిఫ్టు నుంచి మండల కేంద్రంలోని ఊర చెరువుకు నీటి సరఫరా చేసేందుకు 25 క్యూసెక్కుల నీటిని వదిలినట్లు ఏఈఈ శేఖర్ తెలిపారు. రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న నీటి విడుదల..

ఎస్సారెస్పీ నుంచి యాసంగి పంటల కోసం కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 3500, లక్ష్మి కాలువ ద్వారా 300, సరస్వతి కాలువ ద్వారా 800, అలీసాగర్ లిఫ్టు ద్వారా 540, గుత్ప లిఫ్టు ద్వారా 225, ముంపు లిఫ్టుల ద్వారా 312, వరద కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్ట్ నీటి మట్టం తగ్గుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1081.10(55.53 టీఎంసీలు) అడుగుల నీరు ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

అంతర్రాష్ట్ర రోడ్డుపై విద్యార్థుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసులు

బోధన్: బోధన్ నుంచి సాలూరకు ప్రత్యేక బస్సు నడపాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని అంతర్రాష్ట్ర రోడ్డుపై విద్యార్థులు మంగళవారం రాస్తారోకో చేపట్టారు. ఉదయం సాలూర మండల కేంద్రం మీదుగా సుంకిని, హున్సా-మందర్న గ్రామాల నుంచి పట్టణ కేంద్రానికి నడుపుతున్న బస్సుల్లో ఇతర ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు తెలిపారు. మండల కేంద్రానికి ప్రత్యేకంగా బస్సు నడపాలని ఆర్టీసీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విద్యార్థులను సముదాయించి రాస్తారోకోను విరమింపజేశారు.

పేకాట స్థావరంపై దాడి

బోధన్‌రూరల్: మండలంలోని పెంటాకుర్దు గ్రామంలో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై దాడిచేసినట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ మంగళవారం తెలిపారు. ఈ దాడిలో ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 2200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

బుస్సాపూర్‌లో..

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 6980 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక



కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్ రూపొందించిన లర్న్ సైన్స్ విత్ ఫన్ గేమ్స్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేళాలో పాఠశాల విద్యార్థులు మాధవి, శివ కుమార్ రూపొందించిన స్మార్ట్ టాయిలెట్ సిస్టం, ఆటోమేటిక్ క్లాత్ ప్రొటెక్షన్ ఫ్రమ్ రెయిన్ అనే రెండు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం సాయిరెడ్డి తెలిపారు. అలాగే వీరికి గైడ్ టీచర్‌గా ఉపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్ వ్యవహరించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

గోసేవకుడికి 'గోమాత విశిష్టత' పుస్తకం



ధాత్రిక రమేశ్‌కు గోమాత విశిష్టత పుస్తకం అందిస్తున్న సీనియర్ సిటిజన్స్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిరంతరం గోమాత సేవ చేస్తూ వస్తున్న విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ కార్యదర్శి ధాత్రిక రమేశ్‌కు సీనియర్ సిటిజన్స్ మంగళవారం 'గోమాత విశిష్టత' పుస్తకాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా రాజబాపు గుప్త, సేర్ల దయానంద్ మాట్లాడుతూ.. నిత్యం గోమాతలకు సేవ చేస్తున్న ధాత్రిక రమేశ్ ప్రతిఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. ఈ జగత్తులో తల్లి, గోమాత, భూమాత రుణం మాత్రం ఎప్పటికీ తీర్చుకోలేనివని అన్నారు.

ఇలాంటి నేపథ్యంలో అత్యంత విశిష్టమైన గోమాతకు సేవ చేయడమే లక్ష్యంగా రమేశ్ పని చేస్తుండడం గొప్పవిషయమన్నారు. ఇకపై తామూ సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భాస్కర్, సందీప్‌రెడ్డి, ప్రకాశ్, క్రాంతి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'కళాశాల భూమి కబ్జా కాకుండా చూస్తా'



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భూమి అంగుళం కూడా కబ్జా కాకుండా చూస్తానని ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో 1964వ సంవత్సరం నుంచి పనిచేసిన ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ప్రస్తుత ప్రిన్సిపాల్, అధ్యాపకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1964లో కళాశాల కోసం భూమి కొనుగోలు చేసేందుకు కృషి వారిలో తన తండ్రి కేపీ రాజారెడ్డి ఒకరన్నారు. అనంతర కాలంలో 1980 ప్రాంతంలో కళాశాల భవిష్యత్తు కోసం తన తండ్రి పడ్డ తపనను తాను ప్రత్యక్షంగా చూశానంటూ భావోద్వేగానికి లోనయ్యారు. కళాశాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. అనంతరం కళాశాల అభివృద్ధికి ఏర్పాటు చేసిన బొటానికల్ గార్డెన్ రాశివనాన్ని పరిశీలించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్, పూర్వ ప్రిన్సిపాళ్ల, అధ్యాపకులు తిలక్‌శర్మ, సి.ప్రభాకర్, బాల్‌రెడ్డి, ఎస్‌ఎస్.రెడ్డి, సంగయ్య, కరుణాకర్‌రావు, సత్యనారాయణ, పీవీ నర్సింహం, ఎం.మొగలిగౌడ్, విశ్వనాథ్‌రావు, ప్రదీప్‌రెడ్డి, రాఘవరెడ్డి, దామోదర్‌రావు, రంజిత్‌మోహన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన



జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన

నిజామాబాద్ సిటీ: నగరంలోని మున్నూరుకాపు సంఘం కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన ఆకట్టుకుంటోంది. ఈ ఏడాది వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించినట్లు నిర్వాహకుడు బిజ్జు మండల్ తెలిపారు. దేశంలోని ఆంధ్రప్రదేశ్, అస్సాం, బిహార్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, జమ్మూకాశ్మీర్, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, హర్యాణ రాష్ట్రాలకు చెందిన ఉత్పత్తులను బెడ్ కవర్లు, డ్రెస్ మెటీరియల్స్ లభ్యమవుతున్నట్లు చెప్పారు. పాత పట్టు చీరలు, జరీ చీరలు నగదుకు కొంటామన్నారు. ఈ ప్రదర్శన నగరంలో మరో వారం రోజుల పాటు కొనసాగుతుందని నిర్వాహకులు బిజ్జు మండల్ తెలిపారు.

సమయపాలన పాటించని అధికారులు

ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బిచ్కుంద(జుక్కల్): మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయానికి ఎంపీడీవో ఆనంద్ 11.30 గంటలకు కూడా రాలేదు. ఆయన రాక కోసం ఎమ్మెల్యే ఒక గంట వరకు ఎదురు చూశారు. రాకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. అధికారులు సమయపాలన పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల కోసం పని చేయాల్సిన అధికారులు అలసత్వం వీడాలని అన్నారు. వివిధ శాఖల అధికారుల పనితీరుపై ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారని, పద్ధతి మార్చుకొని ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని లేకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు.

క్రైం కార్నర్

దేగాంలో బంగారు చైన్ చోరీ

ఆర్మూర్‌టౌన్: ఓ మహిళ మెడలో ఉన్న బంగారు చైన్‌ను గుర్తు తెలియని దుండగుడు చోరీ చేసిన ఘటన ఆలూర్ మండలం దేగాం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మంథని గంగుబాయి ఇంట్లో ఒంటరిగా ఉన్నట్లు గుర్తించిన దుండగుడు ఇంట్లోకి ప్రవేశించి బంగారు చైన్‌ను దొంగిలించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

మేనూర్‌లో బైక్..

మద్నూర్: మండలంలోని మేనూర్‌లో సోమవారం రాత్రి బైక్ చోరీకి గురైంది. గ్రామానికి చెందిన గౌతమ్ తన బైక్‌ను రాత్రి ఇంటి ఎదుట నిలిపి నిద్రించాడు. కాగా ఉదయం చూసే సరికి చోరీకి గురైంది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

ఈ-కేవైసీకి వచ్చి.. పాముకాటుకు గురై..

- చికిత్స పొందుతూ వివాహిత మృతి
- గ్రామంలో విషాదఛాయలు



దానిబాయి (ఫైల్)

బాన్సువాడ రూరల్: క్యాన్సర్‌కు గురైన భర్తకు హైదరాబాద్‌లో సపర్యలు చేస్తున్న ఓ భార్య స్వగ్రామంలో నిర్వహించిన రేషన్‌షాపు ఈ-కేవైసీకి వచ్చి పాముకాటుతో మృతి చెందిన ఘటన బోర్లం క్యాంపు తండాలో చోటు చేసుకుంది. తండావాసులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన దుంగవత్ దానిబాయి(48) హరిసింగ్ భార్యాభర్తలు. హరిసింగ్ క్యాన్సర్‌కు గురికావడంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. భర్తకు సపర్యలు చేస్తున్న దానిబాయి రేషన్‌షాపు ఈ-కేవైసీ కోసమని స్వగ్రామానికి ఈ నెల 19న వచ్చింది. అదేరోజు రాత్రి దానిబాయిని తన ఇంట్లో నాగు పాము కాటువేసింది. గమనించిన కుటుంబీకులు చికిత్స కోసం బాన్సువాడకు తరలించగా వైద్యుల సూచన మేరకు నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. కాగా అనారోగ్యానికి గురైన భర్తకు సేవలు చేస్తున్న దానిబాయి పాముకాటుకు గురై మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గుండెపోటుతో విద్యుత్ ఆపరేటర్ మృతి



నర్సింహులు (ఫైల్)

లింగంపేట: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్ గొంగ్లళ్ల నర్సింహులు(36) గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కొన్నేళ్లుగా 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నర్సింహులు మంగళవారం ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో అధికారులు కుటుంబ సభ్యులను పరామార్శించి ఆర్థికసాయం అందజేశారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తులు వర్షిత, అక్షర, కుమారుడు హరిశంకర్ ఉన్నారు.

ప్రమాదవశాత్తు జాలరి..

నవీపేట: మండలంలోని నాగేపూర్ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన జాలరి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ మంగళవారం తెలిపారు. మద్దెపల్లి గ్రామానికి చెందిన జాలరి బట్టు శ్రీకాంత్(22) ఈనెల 21న సైకిల్ రిపేర్ కోసం నాగేపూర్‌కు వచ్చి తిరిగి ఇంటికి చేరుకోలేదు. మంగళవారం ఉదయం నాగేపూర్‌లో చెరువులో శ్రీకాంత్ మృతదేహం లభ్యమైందన్నారు. చేపలు పట్టేందుకు వెళ్లిన్న శ్రీకాంత్ ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడడంతో మృతి చెందాడని, తల్లి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముగ్గురి రిమాండ్

మోపాల్: మండలంలోని గుడి తండాకు చెందిన ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన కెతావత్ సుజాత, గోపాల్, సురేశ్ కుటుంబానికి అదే తండాకు చెందిన కెతావత్ రవి, నవీన్ కుటుంబాల మధ్య కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. సంక్రాంతి పండుగ రోజున రవి, నవీన్‌లపై సుజాత, గోపాల్, సురేశ్ దాడి చేశారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఒకరికి మూడు రోజుల జైలు

టీటీపేట: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజుల జైలు శిక్షను జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ప్రతాప్ విధించినట్లు ఎస్సై అనిల్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కాటం సంతోష్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం సేవించినట్లు తేలడంతో కేసు నమోదు చేశారు. ఈ మేరకు జడ్జి సంతోష్‌కు మూడు రోజుల జైలు, రూ. 300 జరిమానా విధించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపరాదని సూచించారు.

యువకుడి అదృశ్యం



పెద్దకొడప్‌గల్: మండలంలోని అంజని గ్రామానికి చెందిన బర్దావాల్ బహదూర్‌సింగ్ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఏఎస్సై రాములు మంగళవారం తెలిపారు. అనారోగ్యానికి గురైన తల్లితండ్రులను బహదూర్‌సింగ్ శ్రద్ధగా చూసుకుంటున్నట్లు చెప్పారు. శనివారం ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన బైక్



గాయాలపాలైన మహేశ్

తాడ్వాయి: ఆటో, బైకు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండల కేంద్రానికి చెందిన మహేశ్, రితీశ్ బైక్‌పై లింగంపేట్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్నారు. సంతాయిపేట్‌కు చెందిన బాలురాజు తన ఆటోలో కామారెడ్డి నుంచి సంతాయిపేట్ వైపు వస్తుండగా వీరిని ఢీకొనడంతో బైక్‌పై ఉన్న మహేశ్, రితీశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో బైక్ నుజ్జునుజ్జు అయింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా


పెద్దకొడప్‌గల్: అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన మండలంలోని అంజని, జగన్నాథ్‌పల్లి శివారులో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం నుంచి దెగ్లూర్ వైపు వెళ్తున్న ట్రాక్టర్ అంజని, జగన్నాథ్‌పల్లి శివారులో అదుపుతప్పి బోల్తాపడిందన్నారు. ఈ ఘటనలో ఒకరికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.



బోల్తాపడిన ట్రాక్టర్

కాపర్ కేటుగాళ్లు

- మూడు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రూ. 3 లక్షల కాపర్, ఆయిల్ చోరీ



నాగిరెడ్డిపేట: జిల్లాలో కాపర్‌కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. గ్రామ శివార్లలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లనే టార్గెట్ చేస్తూ కాపర్ వైర్లు, ఆయిల్ చోరీకి పాల్పడుతున్నారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని రాఘవపల్లి, ధర్మారెడ్డి గ్రామ శివార్లలో ఉన్న మూడు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి దుండగులు కాపర్ వైరు, ఆయిల్‌ను సోమవారం రాత్రి చోరీ చేశారు. వీటి విలువ సుమారు రూ. 3 లక్షల వరకు ఉంటుందని నాగిరెడ్డిపేట ట్రాన్స్‌కో ఏఈ మనోరంజన్ తెలిపారు. రెండు గ్రామాల్లోని రైతులు తమ పంట పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్, ఆయిల్ చోరీకి గురైనట్లు సమాచారం అందించడంతో పరిశీలించినట్లు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.